

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి

కామారెడ్డి టౌన్, జూన్ 6: కామారెడ్డి పట్టణంలో గల ప్రస్తుతం నడుస్తున్న ప్రెసిడెన్షియల్ ప్రైమ్ స్కూల్, ఛాంపియన్స్ స్కూల్, ఇండియాన్ పబ్లిక్ స్కూల్ సదాశివనగర్‌కు ప్రభుత్వ గుర్తింపు లేదని డీఈవో రాజు తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పేముందు సంబంధిత ఎంఈవోను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని అడ్మిషన్ తీసుకోవాలని డీఈవో తెలిపారు. విద్యాధికారులను సంప్రదించకుండా ఇష్టానుసారంగా ప్రైవేట్ పాఠశాలలో చేర్పించినట్లయితే తర్వాత జరిగే పరిణామాలకు తల్లిదండ్రులే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.



సాగుకు పంట చేన్లను సిద్ధం చేస్తున్న రైతులు

వానాకాలం సాగుపై.. ఆశలు!

కామారెడ్డి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాలం పంటల సాగు పెరగనుంది. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగును రైతులు చాలా వరకు తగ్గించారు. యాసంగిలో పలు చోట్ల పంటలే సాగు చేయలేదు. అయితే ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో జిల్లా వ్యాప్తంగా గతంలో లేనంత ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెల ఎలా గడుస్తుందో అనుకుంటున్న తరుణంలో సరిగ్గా పార్లమెంట్ ఎన్నికల రోజు నుంచి వాతావరణం చల్లబడుతూ వచ్చింది. జిల్లాలో గత పక్షం రోజులుగా వర్షాలు కురువడం, తుపాన్‌ల ప్రభావంతో వర్షాకాలం మాదిరిగా పరిస్థితులు మారాయి. జూన్ మొదటి వారంలోనే రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకాయి. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని రైతులు ఇప్పటికే వేసవి దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు పడుతున్న సందర్భంగా విత్తనాలు వేసుకుంటే పంట తొందరగా రావడంతో వర్షాధార పంటలకు ఇబ్బందులు తలెత్తవు. గత ఏడాది వర్షాలు మొదట్లో సరిగ్గా కురవనందున పత్తి, సోయా, మొక్కజొన్న పంట రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట దిగుబడులు తగ్గిపోవడంతో పాటు చీడపీడల బెడదతో సతమతమయ్యారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈసారి ఆ కష్టాలు ఉండవని భావిస్తున్నారు. వేసవి తాపంతో ఉన్న భూములు వర్షపుతడిని పీల్చుకుని సాగుకు యోగ్యంగా మారాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు ఇదే పరిస్థితి.

ఆశాజనకంగా వర్షపాతం

జిల్లాలోని అన్ని మండలాల్లో గత పక్షం రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడంతో ప్రతిరోజూ ఏదో ఒకచోట చిరుజల్లులు పడుతునే ఉన్నాయి. దీంతో సాగుకు భూములను సిద్ధం చేసుకోవడానికి వర్షాలు ఉపయోగపడుతున్నాయి. ఈ నెలలో మొదటి వారంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే నమోదైంది.

- జిల్లాలో చల్లబడిన వాతావరణం
- అంతటా మోస్తారు వర్షాలు
- ముందస్తు వానలు కురువడం సాగుకు ఎంతో మేలు
- గత ఏడాది మొదట్లో వానలు లేక రైతుల ఇబ్బందులు
- ఈసారి భారీ వర్షాలు కురుస్తాయని అంచనాలతో పెరగనున్న పంట విస్తీర్ణం
- జిల్లా వ్యాప్తంగా 5.14 లక్షల ఎకరాల్లో సాగు అంచనా

గత ఏడాది ఇప్పటి వరకు 21.03 మి.మీ వర్షపాతం నమోదు కాగా ఈ సంవత్సరం 53.1మి.మీ వర్షపాతం నమోదైంది. పది మండలాల్లో సాధారణంకంటే ఎక్కువే వర్షాపాతం నమోదు కావడం విశేషం. అయితే కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలకు ఎంతో మేలు చేకూరనుంది. ఇప్పటికే జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పెద్దకొడప్‌గల్, సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి, రాజంపేట, తాడ్వాయి తదితర మండలాల్లో ఆరుతడి పంటలైన సోయా, పత్తి మొక్కజొన్న పప్పుదినుసు పంటలను విత్తనాలను విత్తుతూ సాగు చేస్తున్నారు. మరికొన్నిచోట్ల వరి పంటసాగుకు దుక్కులను దున్నుతూ నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరినాట్లు సైతం వేస్తున్నారు.

5.14లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం

ఏటా వానాకాలంలో వ్యవసాయశాఖ సాగు అంచనా సిద్ధం చేస్తోంది. అందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సారి వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5,14,686 ఎకరాల్లో వివిధ పంట లు సాగవుతాయని అంచనా వేశారు. ఇందులో ఎక్కువగా వరి పంట సాగవుతుందని నిర్ణయించారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వరి 3,13,965 ఎకరాల్లో, సోయాబీన్ 85,444, మొక్కజొన్న 57,315, పత్తి 28,730, కందులు 13,961, మినుములు 5,263, పెసర్లు 4,997, చెరుకు 2,215 ఎకరాలల్లో ఇతర పంటలు 2,200 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ఈ పంటల సాగుకు తగ్గట్టుగా 1,10,284 క్వింటాళ్లలో విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఎరువుల కొరత ఏర్పడకుండా యూరియా 5,908 మెట్రిక్ టన్నులలో డీఏపీ 13,143 మెట్రిక్ టన్నుల్లో, పొటాష్ 8,696 టన్నుల్లో, కాంప్లెక్స్‌లు 33,250 మెట్రిక్ టన్నులలో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే రైతులు ఆరుతడి పంటలకు సంబంధించి సోయా, మొక్కజొన్న, పత్తి, పప్పు దినుసు పంటలకు సంబంధించి విత్తనాలను, పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేసి సాగుకు సిద్ధమవుతున్నారు.

పూర్తయిన ధాన్యం కొనుగోళ్లు

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, జూన్ 6: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మార్చి 26న ఫాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో 350 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా నేటితో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందని ఆయన తెలిపారు. అకాల వర్షాల వల్ల కొనుగోళ్లలో కాస్త ఇబ్బందులు పడ్డ మిల్లర్లు, ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్లతో నిత్యం పరిస్థితిని సమీక్షిస్తూ, కేంద్రాల నిర్వాహకులను మానిటరింగ్ చేసుకుంటూ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. రైతులు కూడా సంయమనం పాటించి జిల్లా యంత్రాంగానికి ఎంతో సహకరించారని తెలిపారు. జిల్లాలో 55,222 మంది రైతుల నుంచి రూ.698కోట్ల 75లక్షల విలువ గల 3,17,181 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో 674 కోట్లు జమ చేశామన్నారు. వంద శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని మిగితా రైతులకు రెండు రోజుల్లో జమ చేస్తామని తెలిపారు.

గుట్కా బ్యాన్

- తయారీ, అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం
- జిల్లాలో ఎక్కడికక్కడే పోలీసుల తనిఖీలు
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే అవకాశం
- నియంత్రణపై అనుమానాలు

కామారెడ్డి టౌన్, జూన్ 6: ప్రజా ఆరోగ్యానికి హాని కల్గిస్తున్న గుట్కాను ప్రభుత్వం బ్యాన్ చేసింది. గుట్కాతో కలిగే అనర్థాలపై పలు రకాల ప్రచారం నిర్వహించినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గుట్కా తయారీ, అమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో నియంత్రణపై పోలీసులు, టాస్కఫోర్స్ అధికారులు దృష్టి సారించి ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు. అయితే ఎక్కువగా పాన్‌షాపుల వద్ద, గల్లీల్లో ఉండే కిరాణ దుకాణాల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో పూర్తిస్థాయిలో నియంత్రణపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విచ్చలవిడిగా వినియోగం

జిల్లాలోని పాన్ దుకాణాలు, కిరాణ, హోటల్‌లు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు ఇలా అన్నిచోట్ల గుట్కా విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఈ వ్యాపారం విస్తరించింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పొగాకు, నికోటిన్ కలిగి ఉండే గుట్కా ఉత్పత్తుల విక్రయాలు, వినియోగంపై గత నెల 24 నుంచి నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తయారీ, నిల్వ, అమ్మకం, రవాణాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ప్యాకెట్లు, డబ్బాలు ఇలా ఏ రూపంలో ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తర్వాత వ్యసనంగా మారుతోంది. చెడు సహవాసాలు, చదువుకు దూరంగా ఉండడం, గుట్కా తినడం ఒక గుర్తింపుగా భావించడం దీనికి కారణాలుగా కనిపిస్తున్నాయి. తోటి వారు తినడంతో గుట్కా, పొగాకు అలవాటు చేసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. నోటి సంబంధిత దుష్ప్రభావాలు, నోటిలో పుండ్లు, క్యాన్సర్‌లు, ఇతర మానసిక, శారీరక రోగాల భారిన పడే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

రూ. లక్షల్లో వ్యాపారం

జిల్లా వ్యాప్తంగా గుట్కా వ్యాపారం ఒక రోజులో రూ.లక్షకు పైగా ఉంటుందని అంచనా, సగటున ఒకరు రోజులో సుమారుగా 4 నుంచి 8 వరకు గుట్కా ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. ఇది పొగాకు, ఖైని, గుట్కా ఇలా పలు రూపాల్లో లభిస్తోంది. గుట్కా కోసం కనీసం ఖరీదును బట్టి రూ.50పైగా ఒక్కొక్కరు రూ.వంద వరకు కూడా ఖర్చు చేస్తున్నారు. జిల్లాకు గుట్కాలు ప్రధానంగా హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి కూడా సరఫరా అవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్రలో గుట్కాలపై నిషేధం గతంలో నుంచి అమలులో ఉంది. అయితే అక్కడ బ్లాక్ మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే గుట్కాలను జిల్లాలో తీసుకువచ్చి అమ్ముతు న్నారనే విమర్శలు లేకపోలేదు.



వ్యాపారుల వద్ద గుట్కాలను గుర్తించిన పోలీసులు (ఫైల్)

పూర్తిస్థాయిలో నియంత్రణ జరిగేనా?

ప్రతీ పల్లెకు విస్తరించి ఉన్న ఈ గుట్కా వ్యాపారం నియంత్రణ సాధ్యమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిస్థాయిలో అమలైతే ప్రజలకు ప్రయోజనం చేకూరుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా గుట్కాకు బానిసలుగా ఉన్నారు. గతంలో చాలా చోట్ల గుట్కా విక్రయాలపై పోలీసులు దాడులు చేసి పెద్దఎత్తున గుట్కా సంచులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఏకంగా ఓ ఇంట్లో గుట్కాలు తయారు చేసిన కేంద్రాన్ని సైతం గుర్తించి తయారీదారుడిని అరెస్ట్ చేశారు. అయితే నిషేధం విధిస్తేనే లాభాలు పెరుగుతాయనే వ్యాపారులు భావిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో కావాల్సిన గుట్కాలు లభిస్తాయని వాటిని ధర పెంచి అమ్మితే వినియోగదారులు కొనుగోలు చేస్తారని ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



కిష్టాపూర్ శివారులో నీట మునిగిన నారుమళ్లు

పెద్ద చెరువు షెట్టర్ ధ్వంసం చేసిన దుండగులు

● నీట మునిగిన నారుమళ్లు

బీర్కూర్, జూన్ 6: బీర్కూర్ - కిష్టాపూర్ గ్రామాల మధ్య పెద్ద చెరువు ఉంది. ఈ చెరువు రెండు గ్రామాల శివారులోని పంట పొలాలకు సాగునీరు అందిస్తోంది. అయితే బుధవారం రాత్రి పెద్ద చెరువు తూం షెట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో చెరువులో నీరు ఖాళీ కావడంతో పాటు చెరువు ఆయకట్టు కింద పొలాలన్నీ జలమయమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసేందు కోసం రైతులు నారుమళ్లు వేసుకోగా నారుమళ్లు అన్ని నీట మునిగాయి. సుమారు 200 ఎకరాలకు సరిపడే నారుమళ్లు నీట మునిగాయని ఆయకట్టు రైతులు తెలిపారు. చెరువులో చేపలు పట్టేందుకోసం తూం షెట్టర్‌ను ధ్వంసం చేసి నీటిని ఖాళీ చేశారని స్థానిక రైతులు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూం షెట్టర్ ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో రైతులు వెంటనే రంగంలోకి దిగి ఇసుక బస్తాలను తూంకు అడ్డంగా వేసి నీటి వృథాను అరికట్టారు.

ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్‌లు, అదనపు ఎస్పీలు, పోలీసు నోడల్ అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్‌లతో జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాల పట్ల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్, టాయిలెట్స్, తాగు నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించుటకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 4,797 మంది గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు రాయుటకు 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పరీక్ష రీజినల్ కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, టీజీపీఎస్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతులు

పెద్ద కొడప్‌గల్, జూన్ 6: జుక్కల్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతన్నలు ఖరీఫ్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్, పిట్లం మండలాలు కమాండ్ ఏరియాలో ఉండగా, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద మండలాలు నాన్‌కమాండ్ ఏరియాలో ఉన్నాయి. పిట్లం, నిజాంసాగర్ మండలాలతో పాటు బిచ్కుంద మండలంలోని కొన్ని గ్రామాలలో వరిపంట సాగు చేస్తారు. ఇక పెద్ద కొడప్‌గల్, జుక్కల్, మద్నూర్ మండలాల పరిధిలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఆరుతడి పంటలు సాగు చేసేందుకు సమయం రావడంతో రైతన్నలు తమ పంటచేలలో ఉన్న వ్యర్థాలను కాల్చివేయడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు రావడంతో పంట వేసేందుకు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్నారు. పంట చేలను సిద్ధం చేసుకుని వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు వేసేందుకు రైతన్నలు సిద్ధంగా ఉన్నారు. ఆరుతడి పంటలు పండించే రైతులు ఈ పాటికే సోయా, పత్తి లాంటి విత్తనాలను తీసుకవచ్చి సిద్ధంగా ఉంచారు. వర్షాలు కురియడమే తరువాయి విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు తెలిపారు. అంతేగాకుండ పంటచేలకు బలం ఉండేందుకు గాను ఈ పాటికే చెరువుల మట్టిని పొలాలకు తరలించారు,



చేనులో పంట వ్యర్థాలను కాల్చుతున్న రైతు


ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాస్‌రావుగుప్తా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పనుల పరిశీలన

మెండోర, జూన్6: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ పదవీ విరమణ పొందడంతో నూతనంగా వచ్చిన శ్రీనివాస్‌రావు గుప్తా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎఫ్ఎఫ్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించి శ్రీరాంసాగర్ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. పదవీ బాధ్యతలతో పాటు ప్రాజెక్టుపై కొనసాగుతున్న ప్రాజెక్టు వరదగేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. కొనసాగుతున్న వరద గేట్ల పనుల వివరాలను ఆరా తీశారు. మిగిలిన వరద గేట్ల మరమ్మతు పనులకు చురుకుగా సాగేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రాజెక్టు అధికారులు గత ఏడాది ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఎస్ఈకి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, డీఈ గణేష్, ఏఈఈ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి'


గోవింద్‌పేట్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, జూన్6: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి రాజ గంగారాం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండలంలోని గోవింద్‌పేట్, ఇస్సాపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను సమీప పాఠశాలలో చేర్పించడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఈనెల 6నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరారు. కోరట్‌పల్లిలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిఈడు గల విద్యార్థులను పాఠశాలలో చేర్పించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈసందర్భంగా గ్రామస్థులకు బడి బాట తాలూకు కరపత్రాలను ఉపాధ్యాయులు అందజేశారు.

వేల్పూర్: మండలంలోని బడిబాట కార్యక్రమాన్ని గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేరని వారిని గుర్తించి పిల్లలను చేర్పించుకునే కార్యమం నిర్వహించారు. అందులో భాగంగానే కుకునూర్ గ్రామంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రవీందర్, మహేందర్, కృష్ణ, అశోక్‌లు ఇంటింటికి సర్వే నుంచి ఏడుగురి గుర్తించి ప్రభుత్వం పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడి టీచర్‌లు, ఆశ వర్కర్‌లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు ఎంఈవో గణేష్ రావు తెలిపారు. ఈ బడిబాట కార్యక్రమం ఈ నెల 19వరకు కొనసాగుతుందని తెలిపారు. దూపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించం జరిగిందని ఆయన అన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని, ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, శ్రీధర్, అమ్మఆదర్శ పాఠశాల చౌర్మన్ సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని కల్దుర్కి పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యబోధన గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య, ఏపీసీ చైర్మన్ ఎస్.ఎంటీ.రేఖ, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లని పాఠశాలలో గురువారం బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎంఈవో శ్రీనివాస్ బడిబాట కార్యక్రమం ప్రారంభించి కరపత్రాలను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్యబోధన అందించడం జరుగుతుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు.ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు,టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్కాల్: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా రూపొందించిన బడిబాట కార్యక్రమం గురువారం బాల్కొండ మండలంలో ప్రారంభించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. జూన్ 6నుంచి 19వ తేదీ వరకు చేపట్టే బాడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మండలస్థాయి, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. గ్రామంలో విలేజ్ ఆర్గనైజేషన్ సమావేశం ఏర్పాటు చేసుకొని ఎంత మంది పిల్లలు ఉన్నారో నమోదు చేసుకొని ప్రతీ ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రుల్లో చదువుపై అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 11వ తేదీన గ్రామసభ ఏర్పాటు చేసి మూడు నుంచి పది వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించాలని, 12వ తేదీన పండుగ వాతావరణంలో పాఠశాలను పునఃప్రారంభించాలని, నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు.13న తొలిమెట్టు కార్యక్రమం, 14న సామూహిక అక్షర భ్యాసం, 15న గర్ల్‌చైల్డ్ ఎడ్యుకేషన్, 18 డిజిటల్ తరగతులపై అవగాహన 19న ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతీ పేద విద్యార్థికి కార్పోరేట్ విద్యను అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం నిర్వహించి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అందరి సహకారంతో విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మహిళ సమాఖ్య అధ్యక్షుడు ఏపీఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● డీఈవో దుర్గాప్రసాద్


స్టేషన్ ఏరియా నీటిట్యాంకును పరిశీలిస్తున్న డీఈవో

నవీపేట,జూన్6: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం నవీపేటలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలు, చావిడి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు స్టేషన్ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధన చేయడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను అందించడం జరుగుతుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యంతో పాటు భవనాలు, మరుగుదొడ్ల మరమ్మతుల పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా పనులను పూర్తి చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ప్రహరి గోడ ఎత్తును పెంచడంతో పాటు పాఠశాల ఆవరణలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను తొలగించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈసందర్భంగా బడిబాటతో పాటు స్టేషన్ ఏరియా పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావు,పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, స్టేషన్ ఏరియా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నరితా రాణి, భరత్ కుమార్, తదితరులున్నారు.

దుబాయ్‌లో బోధన్ యువకుడి మృతి

బోధన్‌రూరల్,జూన్6: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన అవైస్(25)అనే యువకుడు దుబాయ్‌లో స్విమ్మింగ్ చేయడానికి వెళ్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. 3నెలల క్రితం దుబాయ్‌లో పని చేయడానికి వెళ్లిన యువకుడు అతడి స్నేహితులతో కలిసి స్విమ్మింగ్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. 3నెలల క్రితం పనుల కోసం వెళ్లి మృత్యువాత పడ్డాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

తొలకరి వర్షాలు ప్రారంభం

నవీపేట,జూన్6: మండలంలోని పలు గ్రామాలలో గురువారం తొలకరి వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా సాయంత్రానికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరిగి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వేసవి తాపాన్ని భరించిన ప్రజలు తొలకరి వర్షాలు కురియడంతో ఉపశమనం పొందారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సిద్ధం అవుతున్నారు.

కళ్యాపూర్ శివారులో పిడుగుపడి వ్యక్తి మృతి


మృతి చెందిన పీర్యానాయక్

రెంజల్,జూన్6: మండలంలోని దండిగుట్ట గ్రామానికి చెందిన బానోత్ పీర్యా నాయక్(65) పిడుగు పడి మృతి చెందాడు. దండిగుట్ట గ్రామానికి చలెందిన పీర్యా నాయక్ గేదెలను తోలుకుని కళ్యాపూర్ శివారులో గేదెలు మేపడానికి వెళ్లగా భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు రాగా అదే సమయంలో కళ్యాపూర్ శివారులోని మామిడి చెట్టుపై పిడుగు పడడంతో పీర్యానాయక్ చెట్టు కిందనే మృతి చెందాడు.ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న పీర్యానాయక్ చనిపోవడంతో దండిగుట్ట గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.గత 8నెలల క్రితం కుమారుడు అనారోగ్యంతో చనిపోవడంతో ఇంట్లో పెద్ద దిక్కుగా ఉన్న పీర్యా నాయక్ కూడా చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయాన్ని అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అమ్దాపూర్‌లో పిడుగు పాటుకు గేదె మృతి

బోధన్‌రూరల్,జూన్6: గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో పిడుగు పడింది. అమ్దాపూర్ గ్రామానికి చెందిన రమేష్ అనే పాడి రైతులకు చెందిన పాడి గేదె మేతకు వెళ్లగా పిడుగు పాటుకు గురై వ్యవసాయ క్షేత్రంలో మృతి చెందినట్లు స్థానిక రైతులు తెలిపారు. బాధితుడి జీవనాధారం పాడి గేదెపైనే ఆధారపడి ఉందని, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,జూన్6: మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన బోదన్‌కర్ పెద్ద రాజేశ్వర్(55) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ నెల 3న గుర్తు తెలియని పురుగుల మందును సేవించగా వెంటనే అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. చికిత్స పొందుతూ రాజేశ్వర్ గురువారం మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుప్పాలపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ చోరీ

జక్రాన్‌పల్లి, జూన్6: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆలూల్ చోరి చేసినట్టు రైతులు, గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని చెరువు ప్రాంతంలో వ్యవసాయ తోట్లకు సంబంధించిన ట్రాన్స్‌పార్మన్‌లను ధ్వంసం చేసి ఆయిల్ చోరీ చేశారని, దీంతో వ్యవసాయ తోటలో పండిస్తున్న పంటలకు కరెంటు సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, వేసిన విత్తనాలకు మొలకెత్తగా సాగునీరు అందడంలేదని రైతులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

మోర్తాడ్‌లో పేకాట రాయుళ్ల అరెస్టు

మోర్తాడ్,జూన్6:మోర్తాడ్ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. గురువారం మోర్తాడ్ శివారులో మోర్తాడ్‌కు చెందిన నలుగురు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. రూ.16వేల 570లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసి కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జీలుగ విత్తనాల పంపిణీ

మాక్లూర్,జూన్6:మాక్లూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధి లోని కల్లెడి, గుత్ప,మాక్లూర్, మాదాపూర్,రాంచంద్రపల్లి, డీకంపల్లి,చిక్లి, చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల్లోని కేంద్రాలలో గురువారం సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్ జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏవోపద్మ, ఏపీవోఉమాదేవితో పాటు రైతులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

డొంకేశ్వర్,జూన్ 6:డొంకేశ్వర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు కారణంగా శుక్రవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గాయాస్ హైమద్ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మండలంలోని నికాల్‌పూర్, డొంకేశ్వర్ గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

భిక్కనూరు, జూన్ 6: బడీడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాధికారి ఎల్లయ్య సూచించారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మొదటి రోజు ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో బడిబాట ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, నిష్ణాతులైనా ఉపాధ్యాయులతో బోధన చేయడం, క్రీడాస్థలాలు, బాలబాలికలకు వేర్వేరుగా మూత్రశాలలతో పాటుగా తదితర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవేశాలు పెంచేందుకు..

మద్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల అమ్మ కమిటీ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారి తల్లిదండ్రులకు కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించిందని అందులో భాగంగానే బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. గుణాత్మక విద్య బోధన తదితర అంశాల గురించి ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు వివరించనున్నారు. గ్రామాలల్లో తొమ్మిది రోజుల పాటు పర్యటించి అవగాహన కల్పించనున్నారు. పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరనున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో ప్రారంభమైన బడిబాట

పెద్ద కొడప్‌గల్: పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ప్రారంభానికి ముందు ప్రతీ సంవత్సరం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సారి కూడా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులచే గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపాలని, ఉచితంగా విద్య బోధించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని ఉపాధ్యాయులు ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్యాభ్యాసం చేయడం ద్వారా ట్రిపుల్ ఐటీ వంటి చదువులకు అర్హత ఉంటుందని తెలిపారు. ఇదే విధంగా మండలంలోని కాటేపల్లి పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, యాదవ్, లక్ష్మణ్, కిషన్, గ్రామ సంఘం అధ్యక్షురాలు భానుబేగం తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను గుర్తించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా కృషి చేశారు. ఉదయం పాఠశాల ఆవరణలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈనెల 19 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: బడిబాట కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని తీర్మానం చేసి, బడిబాట ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన శ్రీకాంత్‌ను ప్రధానోపాధ్యాయురాలు రాధాలక్ష్మీ, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.


బాగిర్తిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


మద్నూర్‌లో..


కాటేపల్లిలో..


సలాబత్‌పూర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శనేశ్వర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

మద్నూర్, జూన్ 6: మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం భక్తులు శనేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనేశ్వరుని జయంతిని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి ఆలయానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. శనేశ్వరుని జయంతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తే శని బాధలు దూరం అవుతాయని భక్తుల విశ్వాసం. ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న శనేశ్వరుని ఆలయంలో నల్ల నువ్వులు, నువ్వుల నూనెతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయానికి వచ్చిన భక్తుల చేత ప్రత్యేక అర్చన చేయించారు.


ఇంటి కొలతలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు

ప్రతీ ఇంటికి నెంబర్ ఉండాలి

కామారెడ్డి టౌన్, జూన్ 6: పట్టణ ప్రజలు ఇంటి నెంబర్ లేని వాటికి ఇంటి నెంబర్లు తీసుకుని నిబంధనల ప్రకారం ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సుజాత తెలిపారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవీ విహార్, దేవునిపల్లిలో నూతనంగా నిర్మించిన ఇళ్లను ఆమె పరిశీలించారు. ఇంటి నెంబర్ లేని వాటికి కొలతల ప్రకారం ఇంటి పన్ను విధించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నంబర్ కలిగి ఉండాలని ఎవరి ఇంటికైన నెంబర్ లేకపోతే వెంటనే మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి కేంద్రాల పరిశీలన

గాంధారి, జూన్ 6: మండలంలోని జువ్వాడి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న శక్తి కుట్టుమిషన్ కేంద్రాలను గురువారం డీఆర్‌డీవో పీడీ చందర్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కుట్టుమిషన్ వారు ఈ నెల 10వ తేదీలోపు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు దుస్తులు కుట్టడం పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలలకు అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయం ప్రకారం ఇవ్వాలని అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలల గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఏపీఎం గంగారాజు, ఎంఈవో సేవ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి టౌన్, జూన్ 6: కామారెడ్డి జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించడం జరుగుతుందని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

10న ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు

కామారెడ్డి టౌన్, జూన్ 6: ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 10న కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని వరుణ్ మోటార్ కంపెనీలో పలు పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఇంటర్, మెకానిక్ ట్రేడ్ నందు డిప్లొమా/ఏదైన డిగ్రీ/ బీటెక్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈనెల 10న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో 121 గదిలో గల ఉపాధికల్పనా కార్యాలయంలో విద్యార్హత, ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డులు, ఫొటోలతో హాజరు కావాలని మధుసూదన్ సూచించారు. మరిన్ని వివరాలకు 9848237987 లేదా 7671974009 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూన్ 6: మండలంలోని నెమ్లి గ్రామంలో తెలంగాణ మినీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైతు కల్లాలను ఏర్పాటు చేయాలన్నది నా కల

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

భిక్కనూరు, జూన్ 6: కామారెడ్డి నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో రైతు కల్లాలను ఏర్పాటు చేయాలన్నది నాకు ఎప్పటినుండో ఆలోచన, నా కల అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం భిక్కనూరు మండలంలోని కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, బాగిర్తిపల్లి, బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్, భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, లక్ష్మీదేవునిపల్లి, జంగంపల్లి గ్రామాల్లో రైతు కల్లాల ఏర్పాటుకు ఎమ్మెల్యే రైతులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతు కల్లాలు లేకపోవడంతో దాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారని, దింతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. త్వరలోనే ప్రతి గ్రామంలో రైతు కల్లాలను సకల సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. రైతు కల్లాల వద్ద రైతులకు ప్రత్యేకంగా షెడ్డులను నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు కల్లాల ఏర్పాటుకు స్థలాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మండలంలోని సిద్దరామేశ్వరనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణారెడ్డి


ఆశాలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

భిక్కనూరు, జూన్6: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారిణీ యేమిమా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణీ మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకునే విధంగా, నీరు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు, తదితర అంశాలపై ఆశాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఆదర్శ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'నాగిరెడ్డిపేట కాంగ్రెస్‌కు కంచుకోట'

నాగిరెడ్డిపేట, జూన్ 6: మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని పార్లమెంట్ ఎన్నికల ద్వారా మండల ప్రజలు నిరూపించారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఆయన గురువారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో చేతులు కలిసి క్రాస్ ఓటింగ్ చేసి జహీరాబాద్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను ఎన్నికల్లో ఓడించేందుకు ఎన్ని కుట్రలు పన్నినా ఫలితం లేకపోయిందని, మండలంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ ఓట్లు సాధించిందన్నారు. మండల ప్రజలు కాంగ్రెస్‌కు మెజారిటీ ఓట్లు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించారని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇలాగే ఐక్యతతో ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పదవులను కైవసం చేసుకుని కాంగ్రెస్ సత్తాను చాటాలన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపేట మండలం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తాము ఎల్లవేళలా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్‌రెడ్డి, బోయిని విఠల్, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్, షాహెద్ పాషా, ఇమాం, జీవరత్నం, వర్దీయా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మృతి చెందిన సంతోష్

విద్యుత్ స్తంభంపై నుంచి పడి జూనియర్ లైన్‌మన్ మృతి

నిజాంసాగర్, జూన్ 6: మండలంలోని అచ్చంపేట గ్రామ జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న పాత సంతోష్(35) విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. అచ్చంపేట పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతుల కోసం నవోదయ విద్యాలయ ఆవరణలో ఉన్న కరెంటు లైన్లను పరిశీలిస్తుండగా ఆవరణలో ఉన్న స్తంభంపై ఎక్కి మరమ్మతులు చేస్తూ కాలుజారి కింద పడిపోవడంతో తలకు, ముక్కుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాన్స్‌కో ఉద్యోగులు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిజాంసాగర్ పోలీసులు తెలిపారు.

సంతోష్ మృతితో పెద్దమల్లారెడ్డిలో విషాదం..

భిక్కనూరు: నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేటలో విద్యుత్ స్తంబంపై నుండి పడి మృతిచెందిన విద్యుత్ ఉద్యోగి జెఎల్ఎం పాత సంతోష్(35) స్వగ్రామం భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంతోష్ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించాడని, గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే సంతోష్ మృతిచెందాడని తెలుసుకున్న అతడి స్నేహితులు, బంధువులు కుటుంబసభ్యులతో కలిసి అచ్చంపేటకు తరలి వెళ్లారు. సంతోష్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతుడి తల్లి, భార్య, పిల్లలను ఓదార్చడం అక్కడున్న ఎవరితో కాలేదు. మృతుడికి తల్లి రాజమణి, భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు అభిరామ్, ఓంకార్ ఉన్నారు.

సహకార సంఘం పరిధిలో పూర్తయిన ధాన్యం సేకరణ

పెద్ద కొడప్‌గల్, జూన్ 6: పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో రబీ సీజన్ గాను వరి ధాన్యం సేకరణ పూర్తయిందని సహకార సంఘం సిఈవో సందీప్ తెలిపారు. సహకార సంఘం పరిధిలో గల గ్రామాలలో వరి ధాన్యం సేకరణకు గాను 9 వరిధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 1344 మంది రైతుల నుండి 1 లక్ష 63 వేల 656 బస్తాల ధాన్యం సేకరణ చేశామని, వీటికి సంబందించిన ధాన్యం డబ్బులు 12 కోట్ల 37 లక్షల 35 వేల 551 రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. దీంతో పాటుగానే రబీ సీజన్‌లో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేసేందుకు సహకార సంఘం పరిధిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 2405 మంది రైతుల నుండి 97 వేల 449 బస్తాల జొన్నలను కొనుగోలు చేశామని తెలిపారు. ఇక జొన్న రైతులు 334 మంది రైతులకు 2 కోట్ల 37 లక్షల 72 వేల 90 రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇక రైతులకు కావాల్సిన కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఖరీఫ్ సీజన్‌కు గాను రైతులకు అవసరం అయిన యూరియా కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు.


ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు

ఎంపీని కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 6: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన సురేష్‌షెట్కార్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులతోపాటు పార్టీ మహిళా అధ్యక్షురాలు పాకజ్ఞానేశ్వరి రవికుమార్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల ఎంపీగా పనిచేసిన బీబీపాటిల్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాడని అన్నారు. ఆయన హయాంలో పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎంపీగా గెలిచిన సురేష్‌షెట్కార్ గతంలోను ఎంపీగా పనిచేసిన అనుభవం ఉండడంతో పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడెక్కడ ఏఏ సమస్యలు ఉన్నాయనేది ఆయనకు పూర్తి అవగాహన ఉందని అభివృద్ధిని ఆకాంక్షించి ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి ఓటువేసి సురేష్‌షెట్కార్‌ను గెలిపించారని తెలిపారు.

ఎంపీని సన్మానించిన నాయకులు

భిక్కనూరు: జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేష్ షెట్కార్‌ను, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని మండలంలోని జంగంపల్లి కాంగ్రెస్ నాయ కులు గురువారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలీయాస్, మాజీ సర్పంచ్ నర్సింలుయాదవ్, కొమ్ము రమేష్, రామస్వామి, నర్సింలు, రవీందర్, సందీప్‌రాజ్ పాల్గొన్నారు.

ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

దోమకొండ: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందిన సురేష్ షెట్కర్‌ను గురువారం హైదరాబాద్‌లో దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వ సలహదారులు షబ్బీర్‌అలీని మర్యాదపూర్వకంగా కలిశారు.


సురేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రాల నెపంతో కుటుంబంపై దాడి

ఎల్లారెడ్డి, జూన్ 6 : మంత్రాల నెపంతో ఓ కుటుంబంపై దాడి చేసిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన సాయిలు కోడలు విజయ గత కొన్ని రోజులుగా అనారోగ్యం పాలవడంతో ఆమె అనారోగ్యానికి కారణం మన్నె కిష్టయ్యనే మంత్రాలు చేస్తున్నారు అనే నెపంతో పేరు సాయిలు అనే వ్యక్తి ఆయన కుటుంబ సభ్యులు ఏడుగురు కలిసి గురువారం మన్నె కిష్టయ్య ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో కిష్టయ్య, అతని కొడుకు, కూతురుపై దాడి చేశారు. ఈ దాడిలో కిష్టయ్యకు తీవ్ర గాయాలుకావడంతో ఫిర్యాదు చేశాడు. కిష్టయ్య ఫిర్యాదు మేరకు పేరు సాయిలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం కుంటలో లభ్యం

బాన్సువాడ, జూన్ 6: బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్‌లో గురువారం నీటికుంటలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూమబోయ్ మూడు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయితే గ్రామంలోని సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న నీటి కుంటలో గురువారం మృతదేహం కనిపించగా భూమబోయ్‌దిగా గుర్తించారు. ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని సీఐ తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
శాంతి - గమ్‌గమ్ గణేషా
ప్రియా 70 - బజే వాయు వేగం
ప్రియా 35 - లవ్ మీ ఇఫ్‌యూ డేర్

బాన్సువాడ

మహేశ్వరి - భజే వాయు వేగం
వెంకటేశ్వర - గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	151	219	249
వెన్‌కాబ్(కిలో)	:	162	222	260

